సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
ఆదివారం । 10 । నవంబర్ । 2024



విశేషంగా ఆర్జిత సేవలు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు, నిత్యకల్యాణం ఘనంగా జరిగాయి.



వేడుకగా బంతిపూల గౌరమ్మ

విశాఖ: అల్లిపురంలో గౌరీ పరమేశ్వర ఉత్సవాల్లో భాగంగా బంతిపూల గౌరమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.



దట్టంగా పొగమంచు

డుంబ్రిగుడ: మంచు దట్టంగా కురుస్తోంది. చలి ప్రభావం ఎక్కువగా ఉంది. శనివారం ఉదయం 9 వరకు మంచు తెరలు కమ్మేశాయి

న్యూస్‌రీల్

పర్యాటక ప్రాంతాలు కళకళ



వంజంగిలో సందడి చేస్తున్న పర్యాటకులు

సాక్షి,పాడేరు: మన్యంలోని పర్యాటక ప్రాంతాలన్నీ శనివారం కళకళలాడాయి. రెండు రోజుల వరుస సెలవులు రావడంతో మన్యానికి భారీగా తరలివస్తున్నారు. వంజంగి హిల్స్‌పై ప్రకృతి అందాలను తిలకించారు. జనంతో ఈ ప్రాంతం నిండిపోయింది. డల్లాపల్లి, ఘాట్‌లోని కాఫీతోటలు, మోదకొండమ్మతల్లి పాదాల ఆలయం, మత్స్యగుండం క్షేత్రాలను సందర్శించారు.

జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి



కొత్తపల్లి జలపాతం వద్ద పర్యాటకులు

జి.మాడుగుల: కొత్తపల్లి జలపాతం పర్యాటకులతో సందడిగా మారింది. విద్యార్థులు, ఉద్యోగులు, సందర్శకులు ప్రత్యేక వాహనాల్లో వచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. ఫొటోలు, సెల్ఫీలు దిగారు. ఎస్‌ఐ షణ్ముఖరావు జలపాతాన్ని సందర్శించారు. పర్యాటకులు ఇబ్బందులు, సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

గౌరీపరమేశ్వరులకు పసుపు, కుంకుమ సమర్పణ



పసుపు,కుంకుమలతో మహిళలు, గౌరీ సేవా సంఘ ప్రతినిధులు

సాక్షి,పాడేరు: పట్టణంలో కొలువుదీరిన గౌరీ పరమేశ్వరులకు శనివారం పసుపు, కుంకుమను మహిళలు, గౌరీ సంఘం ప్రతినిధులు సమర్పించారు. వీటిని ఆలయానికి ఊరేగింపుగా తీసుకువచ్చి అందజేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కొణతాల సతీష్ మాట్లాడుతూ ఈనెల 30 వరకు గౌరీపరమేశ్వరుల ఉత్సవాలు జరుగుతాయన్నారు. దీనిలో భాగంగా 20న సారె ఊరేగింపు, 25న పసుపు, కుంకుమల పంపిణీ, 27న భారీగా అన్నసమారాధన, 30న గౌరీపరమేశ్వరుల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు మళ్ల పరమేశ్వరరావు, దాడి బుజ్జి, ఎల్లపు మోహన్, కనిశెట్టి వెంకటరావు, మధు, సాయి, కొండబాబు పాల్గొన్నారు.

ఎన్‌పీసీఐతో అనుసంధానం తప్పనిసరి

- పోస్టల్ సూపరింటెండెంట్ శ్రీనివాస్



ముంచంగిపుట్టు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే సంక్షేమ పథకాల నగదు జమ అవ్వాలంటే తప్పనిసరిగా ఎన్‌పీసీఐ (నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా)తో అనుసంధానం చేసుకోవాలని అనకాపల్లి పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ సూచించారు. శనివారం మండలంలోని తపాలా కార్యాలయాల తనిఖీకి వచ్చిన ఆయన మాట్లాడారు. తమ శాఖలో ఐపీపీబీ ఖాతాను వినియోగించుకొని ఆధార్ అనుసంధానాన్ని సులభంగా చేసుకోవచ్చునని అన్నారు. అనకాపల్లి డివిజన్‌లో సుమారు 26 లక్షల మందికి అనుసంధానం లేకపోవడం వల్ల వారి ఖాతాల్లో సంక్షేమ పథకాల నగదు జమకా లేదన్నారు. అనకాపల్లి డివిజన్‌లో రెండు హెడ్ పోస్టాఫీసులు, 45 సబ్ పోస్టాఫీసులు, 559 బ్రాంచ్ పోస్ట్ ఆఫీసుల్లో ఐపీపీబీ సేవలకు సంబంధించి మ్యాపింగ్ జరుగుతుందన్నారు.

చాపరాయికి వీకెండ్ తాకిడి



చాపరాయికి తరలి వచ్చిన పర్యాటకులు

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి వద్ద శనివారం పర్యాటకుల రాకతో కిటకిటలాడింది. రెండో శనివారం, ఆదివారం సెలవు కావడంతో భారీగా తరలివచ్చారు. వనసమారాధనలు నిర్వహించారు. మంచు అందాలను తిలకించారు. అంజోడ వద్ద అరకు పైనరీని సందర్శించారు.



పూల సేకరణకు ముందు విప్ప చెట్టుకు పూజ చేస్తున్న గిరిజనుడు



విప్ప చెట్టు కింద రాలిన పూలను సేకరిస్తున్న గిరి మహిళ

SUNDAY SPECIAL

విప్ప పువ్వు.. కల్పతరువు

గిరిజనులకు అడవి ప్రసాదించిన ఫలాల్లో విప్ప పువ్వు ఒకటి. మన్యంలో విరివిగా లభించే ఇవి గిరిజనులకు మంచి ఆదాయ వనరు. ఇప్పటివరకు సీజన్‌లో మాత్రమే సేకరించి ఆదాయం పొందేవారు. ఇక నుంచి వీటితో ఏడాది పొడవునా అనుబంధ ఆహార ఉత్పత్తులను తయారు చేసి ఆదాయం పొందే దిశగా గిరి మహిళలు అడుగులు వేస్తున్నారు.



- చెట్టుకు 150 కిలోల పువ్వు లభ్యం
- కిలో రూ.50 నుంచి రూ.60కు విక్రయం
- కాయలు కిలో రూ.30కు కొనుగోలు
- ఆధారిత ఉత్పత్తుల తయారీ దిశగా గిరి మహిళల అడుగులు

గిరిజనులకు మంచి ఆదాయ వనరు

చింతూరు: లాటిన్ పరిభాషలో సపోటేసీ జాతికి చెందిన అడవి చెట్టు విప్ప. ఏటా మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పూస్తుంది. చెట్లు కలిగిన గిరిజనులు పూలు రాలడానికి ముందే వాటి చుట్టూ నేలను శుభ్రం చేస్తారు. తెల్లవారుతున్న వేళ విప్పపూలు రాలుతున్న సమయంలో సువాసన వెదజల్లుతుంది. ఇంటిల్లిపాదీ కలసి చెట్టు వద్దకు చేరుకుని బుట్టలు, చేటలతో పూలను సేకరిస్తారు. వీటిని నాలుగైదు రోజులు బాగా ఎండబెడతారు. ఎండిన పూలను సంతలకు తీసుకువెళ్లి విక్రయిస్తారు.

ఏడాది పొడవునా అమ్మకాలు

చింతూరు ఏజెన్సీలో విరివిగా విప్పచెట్లు ఉన్నాయి. కొన్ని గిరిజన కుటుంబాలు వీటిపై వచ్చే ఆదాయంతో ఏడాది పొడవునా జీవనం సాగిస్తున్నాయి. సేకరించిన పూలను ఎండబెట్టి చింతూరు, ఏడుగురాళ్లపల్లి, కుంట మార్కెట్లకు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. భద్రాచలం, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు భారీగా కొనుగోలు చేస్తున్నారు.

- ఒక చెట్టుకు సుమారు 150 కిలోల విప్ప పువ్వు లభ్యమవుతుంది. దీనిని ఎండబెట్టిన తరువాత వచ్చే పువ్వు కిలో రూ.50 నుంచి రూ.60 ధరకు విక్రయిస్తున్నారు. విప్పకాయలు కిలో రూ.30కు అమ్ముతున్నారు. ఈ చెట్లు విస్తారంగా ఉన్నందున గిరిజనులకు చేతినిండా ఆదాయం వస్తోంది.

పోషకాలెన్నో.. : విప్పపూలలో ఎన్నో పోషక గుణాలున్నాయని నిపుణులు చెబుతున్నారు. రోగాలను హరించే ఔషధ గుణాలు కూడా విప్పపూలలో ఉన్నాయని వారు సూచిస్తున్నారు. అధిక రక్తపోటు, మధుమేహం వంటి రోగాలను నయంచేసే గుణంతోపాటు ప్రొటీన్లు, కార్బొహైడ్రేట్లు, ఎనర్జీ, కాల్షియం, ఫాస్ఫరస్, విటమిన్–సి వంటి ఎన్నో పోషక విలువలు ఉన్నాయని వారు చెబుతున్నారు. విప్పకాయలతో చేసిన నూనెతో మసాజ్ చేస్తే కీళ్లనొప్పులు దూరమవుతాయని వారు పేర్కొంటున్నారు.



విప్ప పువ్వులతో తయారుచేసిన హల్వా

స్వీట్ల తయారీ దిశగా అడుగులు

విప్ప పూలను సారా తయారీ, ప్రసాదాల్లో మాత్రమే వినియోగించేవారు. ప్రస్తుతం కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో స్వీట్ల తయారీపై మహిళలు దృష్టి పెట్టారు. చింతూరుకు చెందిన ఓ స్వచ్ఛంద సంస్థ విప్ప పూల సేకరణ, స్వీట్ల తయారీపై మహిళలకు అవగాహన కల్పిస్తోంది. లడ్డూ, హల్వా, జామ్, కేక్ వంటి తినుబండారాల తయారీపై శిక్షణ ఇచ్చి ఉపాధిని అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తోంది.



విప్ప పువ్వుతో లడ్డూల తయారీ

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి



విప్పపువ్వుల్లో ఎన్నో పోషక విలువలు ఉన్నందున వీటితో స్వీట్లు తయారీపై శిక్షణ ఇవ్వడంతోపాటు మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తున్నాం. చింతూరు డివిజన్‌లోని గిరిజన గ్రామాల్లో ఈ ప్రక్రియ చేపట్టాం. తాము అందిస్తున్న సహకారం గిరిజన మహిళల ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుంది.

– సుభాని, కార్యదర్శి, ఆశా స్వచ్ఛంద సంస్థ, చింతూరు

విప్పపువ్వుతో ఆర్థికాదాయం



ప్రతి వేసవిలో ఇంటిల్లిపాదీ కలసి విప్పపూలు సేకరిస్తాం. వాటిని ఆరబెట్టి చింతూరు, మోతుగూడెం సంతల్లో విక్రయించడం ద్వారా ఆదాయం లభిస్తుంది. దీంతోపాటు మా సంస్కృతిలో భాగంగా విప్పపువ్వుతో సారా కూడా తయారుచేసి సేవిస్తాం.

– పూనం మహేష్, లక్కవరం, చింతూరు మండలం

శిక్షణ ఎంతో ఉపయోగం



విప్పపువ్వుల సేకరణతో పాటు ఓ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో స్వీట్ల తయారీలో శిక్షణ పొందుతున్నాం. తయారు చేసే విధానంతోపాటు ఆన్‌లైన్ మార్కెటింగ్‌పై అవగాహన కల్పిస్తున్నారు. నాణ్యమైన విప్పపూల సేకరణకు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నాం.

– వెట్టి కన్నమ్మ, తెరపాడు, చింతూరు మండలం

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

- కేజీబీవీ పాఠశాలలకు చెందిన ఇద్దరు ఎంపిక



కె.కళ్యాణి



కంగాల కృష్ణవేణి

సాక్షి,పాడేరు: రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లాలోని ఇద్దరు మహిళలు ఎంపికయ్యారు. పాడేరు కేజీబీవీ పాఠశాలలో పీజీటీగా పనిచేస్తున్న కె.కళ్యాణి, ఎటపాక కేజీబీవీ పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్న కంగాల కృష్ణవేణిని ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికచేసింది. సెప్టెంబర్ 5న జరగాల్సిన రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కార్యక్రమాన్ని విజయవాడలో వరదలు కారణంగా ప్రభుత్వం తాత్కాలికంగా వాయిదా వేసింది. ఈనేపథ్యంలో ఈనెల 11న అక్కడ రాష్ట్రస్థాయి ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులను జిల్లాల వారీగా శనివారం ప్రకటించింది. ఎంపికైన ఇద్దరు ఉపాధ్యాయులు కేజీబీవీ పాఠశాలలకు చెందిన వారే కావడం విశేషం. ఈ సందర్భంగా వారికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. డీఈవో పి.బ్రహ్మాజీ రావు తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

ఉత్తమ అధ్యాపకుడిగా శ్రీనివాసరావు



పాడేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్.శ్రీనివాసరావు రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపకుడిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు అభినందించారు.

గిరిజన మహిళలపై తేనెటీగల దాడి

8లో



భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం

- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం అన్యాయంగా కేసులు
- ప్రశ్నించే గొంతులపై ఉక్కుపాదం
- అక్రమ అరెస్టులు తక్షణం నిలిపివేయాలి
- అరకు ఎంపీ తనూజరాణి, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు డిమాండ్
- ఎస్పీ అమిత్‌బర్దర్‌కు వినతి పత్రం అందజేత



ఎస్పీ అమిత్‌బర్దర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ తనూజరాణి, పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరు : భావ ప్రకటన స్వేచ్ఛకు విఘాతం కలిగిస్తూ వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేయడం, వేధింపులకు గురిచేయడం తక్షణమే ఆపాలని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం వారు జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ అమిత్‌బర్దర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తమ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలు ఎండగడుతూ మాత్రమే పోస్టులు పెడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం తమ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి అరెస్ట్ చేయిస్తూ హింసిస్తోందన్నారు. ప్రజాస్వామ్యంలో భావ ప్రకటన స్వేచ్ఛ ఒక హక్కు అని ఇటీవల సుప్రీంకోర్టు వెల్లడించిందన్నారు. అందుకు విరుద్ధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. తప్పులను ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. తమ వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు తమ పార్టీ నాయకులపై కూటమి సోషల్ మీడియా కార్యకర్తలు, వారి అనుకూల మీడియా అసభ్యకరంగా పోస్టులు పెడుతున్నా వారిపై ఎటువంటి చర్యలు లేవన్నారు. వైఎస్సార్‌సీపీపై అభ్యంతరకర, అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని వారు కోరారు.

ఎన్ని కేసులు పెట్టినా వెనక్కి తగ్గేది లేదు

వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కూటమి ప్రభుత్వం ఎన్ని అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేసినా వెనక్కి తగ్గేది లేదని అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి, పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు స్పష్టం చేశారు. వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాస్వామ్యబద్ధంగా నిత్యం ప్రశ్నిస్తూనే ఉంటామన్నారు. సోషల్ మీడియా కార్యకర్తలకు తమ పార్టీ లీగల్ సెల్‌తో పాటు తాము అండగా ఉంటామని వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, మాజీ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు కూతంగి సూరిబాబు, రాష్ట్ర ఎస్టీ సెల్ సంయుక్త కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, ఎంపీటీసీ గిడ్డి విజయలక్ష్మి, సర్పంచ్‌లు గబ్బాడ చిట్టిబాబు, రాంబాబు, మాజీ సర్పంచ్ శరభ సూర్యనారాయణ, పార్టీ వాణిజ్య విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు డీపీ రాంబాబు పాల్గొన్నారు.

దొంగల ముఠా హల్‌చల్





గిరిజనులు పట్టుకున్న దొంగల ముఠా సభ్యులు

- ఎదురుతిరిగి పది మందిని పట్టుకున్న గిన్నెలగరువు, వంచర్ల గిరిజనులు
- బంధించి పెదబయలు పోలీసులకు అప్పగింత

సాక్షి,పాడేరు: జిల్లాలోని పెదబయలు మండలంలోని మారుమూల ఇంజరి పంచాయతీ గిన్నెగరువులో శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో హల్ చల్ చేసిన దొంగలముఠాపై గిరిజనులు ఎదురుతిరిగి పట్టుకున్నారు. పది మందిని తాళ్లతో బంధించి పోలీసులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. రెండు కార్లలో పది మంది ముఠా సభ్యులు వచ్చారు. కార్లను శివారులో వదిలి గిన్నెగరువు గ్రామంలో ప్రవేశించారు. ఇళ్లలోకి చొరబడి దోచుకునేందుకు ప్రయత్నించారు. కొంతమంది కేకలు వేయడంతో గ్రామంలోని అందరూ అక్కడి చేరుకుని ముఠాలోని ఆరుగురిని పట్టుకున్నారు. పారిపోతున్న మిగతా నలుగురిని బొంగరం పంచాయతీ వంచర్లలో గిరిజనులు పట్టుకున్నారు. మొత్తం పది మందిని కాళ్లు, చేతులను తాళ్లతో కట్టి బంధించి రాత్రంతా గ్రామంలోనే ఉంచారు. వీరంతా ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన దారిదోపిడీ దొంగలుగా అనుమానిస్తున్నారు. ఈ ముఠాలో మహిళలు కూడా ఉన్నారు. వీరి వద్ద మత్తు మందులు, మారణాయుధాలు ఉన్నట్టు గిరిజనులు తెలిపారు. శనివారం రెండు కార్లు, పట్టుకున్న ముఠా సభ్యులు పది మంది పెదబయలు పోలీసుస్టేషన్‌కు అప్పగించారు. పోలీసులు లోతుగా విచారిస్తున్నారు.

టీడీపీ నేతల కనుసన్నల్లోనే ఇసుక తవ్వకాలు



బాధిత కుటుంబాలను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ అనంత బాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి



ఎమ్మెల్సీ వెల్లడించిన ట్రాక్టర్‌కు టీడీపీ జెండాలు కట్టి ఇసుక రవాణా చేస్తున్న ఆ పార్టీ నేతల ఫొటో

- అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం
- చర్యలు తీసుకోకుండా అడ్డుపడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, భర్త
- ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే ధనలక్ష్మి ధ్వజం
- మృతుల కుటుంబాలకు పరామర్శ

అడ్డతీగల: టీడీపీ నేతల కనుసన్నల్లోనే బొంగరాలపాడు వద్ద అక్రమ ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎమ్మెల్సీ అనంత బాబు, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి ధ్వజమెత్తారు. శనివారం వారు బొంగరాలపాడు వద్ద ప్రమాదం జరిగిన ఏలేరు వాగు ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విచ్చలవిడిగా తవ్వకాలు చేయడం వల్ల వాగులో గోతులు పడి నలుగురు ప్రాణాలు పోవడానికి కారణం అయ్యిందన్నారు. బాధిత కుటుంబాలను ఓదార్చారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. గత కొన్ని నెలలుగా అధికార పార్టీ నేతల అండదండలతో అనధికార ర్యాంపులో ఇసుక తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని విమర్శించారు. ఇసుక తవ్వకాలపై తిమ్మాపురానికి చెందిన వారు అధికారులకు ఫిర్యాదు చేశారన్నారు. రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషాదేవి, ఆమె భర్త అధికారులపై ఒత్తిడి తెచ్చి ఎటువంటి చర్యలు తీసుకోకుండా చేశారన్నారు. ఇసుక భారీ ఎత్తున తవ్వడం వల్ల ఏర్పడిన గోతులు నలుగురు మృతికి కారణమయ్యాయన్నారు. అధికార పార్టీ నాయకులు స్వయంగా పార్టీ జెండాలు కట్టి ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ల ఫొటోలను విడుదల చేశారు. వాగులో పడి చనిపోయిన వారంతా కూలీలన్నారు. మృతుల్లో ఒక్కొక్క కుటుంబానికి ప్రభుత్వం రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు.

నాటు పడవకు తప్పిన ప్రమాదం

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోట పంచాయతీ కుమ్మరిపుట్టు వద్ద మత్స్యగెడ్డలో నాటుపడవకు ప్రమాదం తప్పింది. ప్రతి రోజు కుమ్మరిపుట్టు వద్ద మత్స్యగెడ్డను తాడు సాయంతో దాటుతుంటారు. దీనిలో భాగంగానే శనివారం మండల కేంద్రంలో జరిగిన వారపు సంతకు వచ్చిన గిరిజనులు తిరుగు ప్రయాణంలో సాయంత్రం నాటు పడవపై బయలుదేరారు. ఈ సమయంలో తాడు తెగిపోయింది. దీంతో నాటుపడవను నడిపి గిరిజనుడు గొల్లోరి సుక్ర ఎంతో చాకచక్యంగా వ్యవహరించి ఒడ్డుకు చేర్చాడు. తాడు తెగిపోయిన సమయంలో ఎనిమిది మంది మాత్రమే ప్రయాణికులు ఉన్నారు. వీరంతా క్షేమంగా ఒడ్డుకు చేరుకోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. కుమ్మరిపుట్టు వద్ద మత్స్యగెడ్డపై వంతెన నిర్మించాలని, ఫైబర్ బోట్లు అందించాలని కోరుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని మత్స్యగెడ్డ పరివాహక ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



మత్స్యగెడ్డలో తాడు తెగిపోవడంతో నాటు పడవను ఒడ్డుకు తీసుకువస్తున్న గిరిజనులు

మరో ఇద్దరి మృతదేహాలు లభ్యం

- బయటకు తీసిన ఎన్డీఆర్ఎఫ్ బృందాలు
- ఏలేరు వాగులో గల్లంతైన నలుగురు మృతి
- మిన్నంటిన రోదనలు

అడ్డతీగల: మండలంలోని బొంగరాలపాడు వద్ద ఏలేరు వాగులో గల్లంతైన వారిలో మరో ఇద్దరి మృతదేహాలు శనివారం లభ్యమయ్యాయి. ఇసుక కోసం దిగిన వారిలో నలుగురు గల్లంతయ్యారు. వీరిలో శుక్రవారం వీరమాల జయబాబు, చిన్న గొంతియ్య మృతదేహాలను ఎస్డీఆర్ఆఫ్ బృందాలు బయటకు తీయడం తెలిసిందే. శనివారం ఉదయం విస్తృతంగా గాలింపులు చేపట్టిన బృందం సభ్యులు వీరమాల భూషణం (60), చింతా శ్రీను(19) మృతదేహాలను బయటకు తీశారు. దీంతో సంఘటన స్థలం వద్ద మృతుల బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. భర్త వీరమాల భూషణం మృతితో భార్య లక్ష్మి గుండెలవిసేలా రోదించింది. ఈ ఘటనలో భర్తతోపాటు కొడుకుని, అల్లుడు చినగొంతియ్యను ఆమె కోల్పోయింది. వాగులో గల్లంతైన దగ్గర నుంచి ఆమె అక్కడే ఉండిపోయింది. శుక్రవారం కుమారుడు జయబాబు, అల్లుడు చినగొంతియ్య మృతదేహాలు లభ్యం కాగా శనివారం భర్త మృతదేహం లభ్యమైంది. ఇలా కుటుంబ సభ్యులు ముగ్గురిని కోల్పోయిన లక్ష్మి పరిస్థితి దయనీయంగా మారింది. మరో మృతుడు చింతా శ్రీను తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. వీరికి ఇద్దరు కుమారులు. పెద్దవాడైన శ్రీను కుటుంబానికి ఆసరాగా ఉంటున్నాడు. అందివచ్చావు అనుకుంటే తిరిగి రాని లోకాలకు పోయావా నాయనా అంటూ వారు విలపించారు. ఇలావుండగా బయటకు తీసిన రెండు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.



వీరమాల భూషణం మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య లక్ష్మి



చింతా శ్రీను మృతదేహాన్ని తీసుకువస్తున్న ఎస్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు

క్లుప్తంగా

రైతులకు సూచనలు

రాజవొమ్మంగి: మండల పరిసర ప్రాంతాల్లో ఖరీఫ్ వరి పంట ప్రస్తుతం పొట్ట, ఈనిక, పాలుపోసుకొనే దశలో ఉందని ఇన్‌చార్జ్ ఏఓ చక్రధర్ అన్నారు. ఆయన శనివారం మండలంలోని పలు వ్యవసాయక్షేత్రాలను పరిశీలించి రైతులకు సలహాలు సూచనలు ఇచ్చారు. ప్రస్తుతం వరి పైరుపై రసాయనాలు, పురుగుమందులు ఎట్టి పరిస్థితులలోను స్ప్రే చేయవద్దని సూచించారు. గింజ గట్టిపడే వరకు పొలంలో కనీసం రెండు అంగుళాల మేర నీరు పుష్కలంగా ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యవసాయ సిబ్బంది సూచించే నీటి యాజమాన్య పద్ధతులు పాటించాలని కోరారు. వరిలో వెన్నులు వస్తున్న దశ కనుక పంటను అడవి జంతువుల నుంచి కాపాడుకోవాలన్నారు.

ఏలేరు కాలువలో పడి పాడి రైతు మృతి


దాసరి ఆనంద్ (ఫైల్)

కోటవురట్ల : పశువులను మేపడానికి వెళ్లి ప్రమాదవశాత్తూ ఏలేరు కాలువలో పడి పాడి రైతు మృతి చెందాడు. మండలంలోని జి. భీమవరం శివారు సింగవరంలో శనివారం ఈ విషాద సంఘటన చోటు చేసుకుంది. సీఐ అల్లు స్వామినాయుడు అందించిన వివరాల ప్రకారం...సింగవరం గ్రామంలో దాసరి ఆనంద్ (53) గేదెలను మేపడానికి వెళ్లి వాటికి తాగునీటి కోసం ఏలేరు కాలువకు తీసుకెళ్లాడు. కాలువలో దిగుతుండగా ప్రమాదవశాత్తూ నీటిలో పడి మునిగి ప్రాణాపాయ స్థితిలో ఉండగా స్థానికులు వెలికి తీసి అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆనంద్ మృతి చెందినట్టు ధ్రువీకరించారు. ఈ మేరకు భార్య లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న సురేష్‌బాబు

ఎటపాక: అప్పుల బాధతో ఓ వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని పురుషోత్తపట్టణంలో జరిగింది. నూతలపాటి సురేష్‌బాబు (36) భద్రాచలంలో ఓ ఫాస్ట్‌ఫెడ్ సెంటర్ పెట్టాడు. వ్యాపారంలో నష్టాలు రావడంతో హోటల్‌ను మూసివేశాడు. చేసిన అప్పులు తీర్చలేక ఇంట్లో తరచు మనోవేదనకు గురై శుక్రవారం రాత్రి గ్రామ సమీపంలోని సెయింట్ ఆన్స్ పాఠశాల వెనుక తోటలోకి వెళ్లి పురుగు మందు తాగాడు. ఉదయం సురేష్‌బాబు మృతదేహాన్ని చూసిన వారు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎటపాక ఎస్సై పార్థసారథి తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారని, సుమారు రూ.7 లక్షల అప్పులు ఉన్నాయని తెలిపారు.

ఆదివాసీ హక్కులపై మరింత చైతన్యం అవసరం


మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం


హాజరైన ఆదివాసీ ప్రజా సంఘాల నాయకులు

అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం

అరకులోయ రూరల్: గిరిజన విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నవంబర్ 15న జరగనున్న భగవన్ బిర్సాముండా 150వ జయంతిలో భాగంగా శనివారం మండల కేంద్రంలో గిరిజన హక్కులు చట్టాలపై జిల్లా స్థాయి సామాజిక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం శనివారం ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి శిక్షణ తరగతులు నిర్వహించడం ఎంతో అభినందనీయమన్నారు. కనుమరుగవుతున్న ఆదివాసీ హక్కులు చట్టాలపై నేటి తరం యువతి యువకులను అవగాహన కల్పించేందుకు దోహదపడుతుందన్నారు. రాజ్యాంగం ద్వారా ఆదివాసీలకు వచ్చే ఎన్నో హక్కులు చట్టాలు ఉన్నప్పటికీ అవగాహన లోపంతో ప్రతి ఫలం పొందలేక పోతున్నారన్నారు. గిరిజన ప్రాంతంలో గిరిజనేతరుల ఆగడాలు మరింత పెరిగిందన్నారు. 5వ షెడ్యూల్ ప్రాంతంలో అన్ని రంగాల్లో ఆదివాసీలకే సర్వం హక్కు ఉన్నప్పటికీ కొంతమంది పాలకులు వాటిని కాలరాస్తు నిరచేసేందుకు కుట్ర పనుతున్నరన్నారు. 1/70, పీసా, అటవీ హక్కు వంటి చట్టాలు ఉన్నా అమాయక ఆదివాసీలు దోపిడీలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాధికారం ఆదివాసీల చేతులో వస్తేనే అన్ని రంగాల్లో ఆదివాసీలకు మనుగడ ఉంటుందన్నారు. ప్రభుత్వం జీవో నంబర్ 3-కు చట్టబద్ధత కల్పించాలని, గిరిజన ప్రాంతంలో ప్రత్యేక డీఎస్సీ ప్రకటించాలని, వంద శాతం రిజర్వేషన్ ఆదివాసీలకే ఇవ్వాలన్నారు. ఆదివాసీ ఉద్యోగ, ప్రజా సంఘాల నాయకులు రామరావు దొర, మహదేవ్, ఆనంద్, గోపాల్, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన మహిళలపై తేనెటీగల దాడి

- ఐదుగురికి తీవ్ర గాయాలు
- పరిస్థితి విషమం
- ముంచంగిపుట్టు సీహెచ్‌సీలో వైద్యసేవలు


బాధిత మహిళలను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముంచంగిపుట్టు: మండలంలోని జోలాపుట్టు పంచాయతీ కులబీరు గ్రామ సమీపంలో సామలు పంట కోత పనుల్లో నిమగ్నమైన గిరిజన మహిళలపై తేనెటీగలు దాడి చేశాయి. వీరిలో తీవ్రంగా గాయపడిన ఐదుగురి పరిస్థితి విషమంగా ఉంది. వివరాలిలా ఉన్నాయి. కులబీరు గ్రామ సమీపంలో శనివారం మధ్యాహ్నం సుమారు 30 మంది మహిళలు సామలు పంటను కోస్తున్నారు. ఈ సమయంలో వీరిపై ఆకస్మికంగా తేనెటీగలు దాడి చేయడంతో వారు పరుగులు పెట్టారు. వీరిలో దొర సోయిత, దొర రుక్మిణి, కిముడు దొసుద, దొర జోనుమెత్తి, దొర లక్ష్మి, దొర గోర ముఖం, కాళ్లు, చేతులపై తీవ్ర గాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా మారడంతో స్థానికులు హుటాహుటిన లబ్బూరు పీహెచ్‌సీకి ప్రైవేట్ వాహనంలో తరలించారు. వెంటనే వైద్యాధికారి ప్రతాప్ వైద్యం అందించారు. వీరిలో ఐదుగురి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్య సేవల నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అరబీరు జగబంధు, జోలాపుట్టు సర్పంచ్ దొర నీలకంఠం, వైఎస్సార్‌సీపీ మండల నేత భాగత్‌రాంలు బాధిత మహిళలను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని వైద్యులకు సూచించారు. వైద్యుల పర్యవేక్షణలో వారు చికిత్స పొందుతున్నారు.

రాష్ట్రంలో తాలిబన్ల తరహా పాలన

- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తే కేసులు పెట్టి అరెస్ట్ చేస్తారా?
- వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి


మాట్లాడుతున్న వరుదు కల్యాణి

బీచ్‌రోడ్డు : రాష్ట్రంలో చాలా దారుణమైన పరిస్థితులు నెలకొన్నాయని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలపై కేసులు పెడుతుండడం అరాచక పాలనకు నిదర్శనమని ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వరుదు కల్యాణి మండిపడ్డారు. తాజా పరిస్థితులను చూస్తుంటే రాష్ట్రంలో తాలిబన్ల తరహా పాలన సాగుతుందనడంలో ఎటువంటి అనుమానం అవసరం లేదన్నారు. విశాఖలో శనివారం మీడియాతో ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తల అరెస్ట్‌లను చూస్తుంటే, అసలు ఆంధ్రలో ఉన్నామా.. ఆఫ్ఘనిస్తాన్‌లో ఉన్నామా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో అసలు ప్రజాస్వామ్యం ఉందా.. పౌర హక్కులున్నాయా...? అని ప్రశ్నించారు. సుధారాణి అనే సామాన్య సోషల్ మీడియా కార్యకర్తను తెలంగాణలో అరెస్ట్ చేసి చిలకలూరిపేటకు తీసుకొచ్చి ఐదు రోజుల పాటు నిర్బంధించి వేధించి, బాధించడం పాలకుల క్రూరత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. ఆమెపై పోలీసులు చేయి చేసుకోవడంతో ఒంటి మీద గాయాలను జడ్జికి చూపారంటే పరిస్థితులు ఎంత దిగజారిపోయాయో అర్థం చేసుకోవచ్చన్నారు. వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్టులు చేస్తున్నట్లే.. మాజీ సీఎం జగన్ కుటుంబీకులైన విజయమ్మ, షర్మిల, భారతమ్మ మీద దారుణ పోస్టులు పెట్టిన ఐటీడీపీ సోషల్ మీడియా వారిని ఎందుకు అరెస్ట్ చేయడం లేదని ప్రశ్నించారు. తుళ్లూరు మండలంలో తురక శ్రీను అనే వ్యక్తి ఏడాదిన్నర క్రితం చనిపోయినా నోటీసులు పంపి కేసులు పెట్టారంటే ప్రభుత్వ పైశాచికత్వం ఏ స్థాయికో చేరిందో తెలుస్తోందని ధ్వజమెత్తారు. ఆడపిల్లల మానప్రాణాల రక్షణలో వైఫల్యంతో ప్రజలకు సమాధానం చెప్పలేక డైవర్షన్ చేసేందుకే వైఎస్సార్ సీపీ సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్ట్ చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజల్లో వ్యతిరేకతను దృష్టి మరల్చడానికి, వారిని భయభ్రాంతులకు గురిచేయాలని చంద్రబాబు చూస్తున్నారని మండిపడ్డారు. గతంలో లోకేష్ రూ.10 కోట్లు ఖర్చు చేసి తన తల్లిని తిట్టించారని పవన్ ఆరోపణ చేశారని, మరి ఇప్పుడు లోకేష్‌పై ఎందుకు కేసులు పెట్టలేదని ప్రశ్నించారు. సోషల్ మీడియా కార్యకర్తలను అరెస్ట్ చూపకుండా స్టేషన్లు తిప్పుతున్నారని, ఆచూకీ కోసం హెబియస్ కార్పస్ పిటిషన్లు వేయాల్సి వస్తోందని, పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని హితవు పలికారు. న్యాయపోరాటంతో వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు.

కోసంగూడలో విద్యుత్ వెలుగులు

- జెడ్పీ చైర్‌పర్సన్ చొరవతో 77 ఏళ్ల తర్వాత విద్యుత్ కాంతులు
- హర్షం వ్యక్తం చేసిన గిరిజనులు


కోసంగూడ గ్రామ గిరిజనులతో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

ముంచంగిపుట్టు: మండలంలో గల బంగారుమెట్ట పంచాయితీ కోసంగూడ గ్రామ గిరిజనులు స్వాతంత్రం వచ్చి 77ఏళ్ల గడుస్తున్న దీపం బుడ్డి వెలుగులోనే జీవనం గడుపుతూ వచ్చారు. గత ఏడాది విద్యుత్ సమస్యను కోసంగూడ గిరిజనులు జెడ్పీ చైర్ పర్సన్ జల్లిపల్లి సుభద్రను కలిసి విద్యుత్ లేక పడుతున్న కష్టాలను వివరించి, వినతిపత్రం అందించారు. దీంతో స్పందించిన జెడ్పీ చైర్‌పర్సన్ విద్యుత్‌శాఖ సీఎండీతో మాట్లాడి కోసంగూడ విద్యుత్ సమస్యను వివరించి, వెంటనే విద్యుత్ సౌకర్యాం కల్పించాలని కోరారు .దీంతో యుద్ధ ప్రాతిపదికన విద్యుత్ స్తంభాలు వేసి, కేవలం నాలుగు నెలల్లోనే కోసంగూడకు విద్యుత్ సౌకర్యం కల్పించారు. గ్రామానికి విద్యుత్ వెలుగులు రావడంతో శనివారం జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్రను సంతోషంగా గ్రామానికి ఆహ్వానించారు. దీంతో సరైన రహదారి లేని కోసంగూడ గ్రామానికి జెడ్పీ చైర్ పర్సన్ సుభద్ర రెండు కిలో మీటర్లు నడిచి గ్రామానికి వెళ్లారు. గ్రామస్తులు పూలమాలు వేసి హర్షం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో గ్రామానికి పక్క తారురోడ్డు, తాగునీటి సమస్యలు పరిష్కరిస్తానని జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పద్మారావు, సర్పంచ్ రత్న, సుజనకోట ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బలక్ష్మీ, నాయకులు మూర్తి, గణేశ్వరరావు, మోహన్‌రావు, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

చెరువు మదుం కూలి రైతు మృతి


రైతు కన్నంనాయుడు మృతదేహం వద్ద రోదిస్తున్న భార్య పార్వతి


చెరువు వద్ద కూలిన మదుం ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ లక్ష్మీనారాయణ

- పొలానికి నీరందించడానికి మదుం గేట్లు ఎత్తుతుండగా ఘటన

కె.కోటపాడు : పైడమ్మ చెరువు మదుం కూలిపోవడంతో సింగన్నదొరపాలేనికి చెందిన రైతు రొంగలి కన్నంనాయుడు(61) ఘటనా స్థలంలోనే శుక్రవారం మృతిచెందాడు. ఘటనపై మృతుని కుమారుడు మల్లునాయుడు ఎ.కోడూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలివి. తన పొలానికి నీరును అందించేందుకు రైతు కన్నంనాయుడు పైడమ్మచెరువు వద్ద గల మదుం గేట్లు ఎత్తుతుండగా మదుం గోడ ఒక్కసారిగా కూలింది. దీంతో కన్నంనాయుడు కింద పడగా, మదుం గోడలు ఆయనపై పడిపోయాయి. దీంతో సంఘటన స్థలంలోనే మదుం గోడల మధ్య చిక్కుకుని కన్నంనాయుడు మృతిచెందాడు. కన్నంనాయుడు మృతదేహం వద్ద భార్య పార్వతి రోదన స్థానికులను కంటతడి పెట్టించింది. మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్‌జెండర్ మృతి

నక్కపల్లి : జాతీయరహదారిపై వేంపాడు టోల్ ప్లాజా వద్ద శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాన్స్ జెండర్ దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం నాతవరం మండలం మాధవరం గ్రామానికి చెందిన అంకంరెడ్డి రాజబాబు అలియాస్ రాధిక(35) కొద్ది సంవత్సరాల క్రితం ట్రాన్స్ జెండర్‌గా మారి తునిలో నివాసం ఉంటూ వేంపాడు టోల్‌ప్లాజా ప్రాంతాల్లో భిక్షాటన చేస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి సమయంలో టోల్‌ప్లాజా వద్ద రోడ్డు దాటుతుండగా విశాఖ నుంచి తుని వైపు వెళ్తున్న బస్సు ఢీకొట్టింది. దీంతో తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదు

గిడ్డి ఈశ్వరి తీరుపై వైఎస్సార్‌సీపీ నాయకుల ధ్వజం


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు

పాడేరు : వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎంతో ప్రజాదరణతో గెలిచిన వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజుపై ప్రజల విశ్వాసం కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అనుచిత వాఖ్యలు చేయడం మానుకోవాలని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, డి.గొందూరు సర్పంచ్ సీదరి రాంబాబు హితవు పలికారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. 2014 ఎన్నికలకు ముందు ఉపాధ్యాయ వృత్తిలో సక్రమంగా పనిచేయక సస్పెండైన గిడ్డి ఈశ్వరిని తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలిచి టికెట్ ఇచ్చి ఎమ్మెల్యేగా గెలిపించారని గుర్తు చేశారు. కానీ తన స్వలాభం కోసం కోట్లాది రూపాయలకు టీడీపీకి ఆనాడు అమ్ముడు పోయిన గిడ్డి ఈశ్వరి స్వలాభాల కోసం మాట్లాడటం సిగ్గు చేటన్నారు. 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి చెంది ప్రజల విశ్వాశాన్ని కోల్పోయినట్టు చెప్పారు. కూటమి ప్రభుత్వం విడుదల చేసిన నామినేటెడ్ పదవులు దక్కించుకోలేక ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారన్నారు. ఎటువంటి ప్రోటోకాల్ లేకుండా అధికారిక కార్యక్రమాల్లో ఆమె ఎలా వెళ్తున్నారని ప్రశ్నించారు. ఓ వైపు టీడీపీ .. మరోవైపు నియోజకవర్గ ప్రజలు గిడ్డి ఈశ్వరిని నమ్మే పరిస్థితి లేదని ఎద్దేవా చేశారు. ఇకపై వైఎస్సార్‌సీపీ అధినేత, ఎమ్మెల్యేలపై లేనిపోని ఆరోపణలు, వాఖ్యలు చేస్తే ఊరుకోమని హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం


అడ్డతీగలలో గర్భిణులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి సతీష్


వై.రామవరం సీహెచ్‌సీలో గర్భిణులకు స్కానింగ్ చేస్తున్న వైద్యాధికారులు


జడ్డంగి పీహెచ్‌సీలో గర్భిణీని పరీక్షించి, ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొంటున్న డాక్టర్ నాగార్జున

- గ్రామాల్లో గర్భిణులకు వైద్య పరీక్షలు
- ఆరోగ్య భద్రతపై వైద్యుల సూచనలు

అడ్డతీగల: ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ (పీఎంఎస్ఎంఎ)లో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు జరిపి మందులు అందజేసినట్టు అడ్డతీగల సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ పండా సతీష్ అన్నారు. ఈ మేరకు శనివారం 45 మంది గర్భిణులకు పరీక్షలు చేసి మందులు ఇచ్చి తగిన సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. గర్భిణులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. గైనకాలజిస్ట్ వై.వి.రమణ సేవలందిస్తారన్నారు. ప్రతి నెల 9న నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దీనిపై గ్రామాల్లోని ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీ వర్కర్లు అవగాహన కల్పించాలన్నారు. వైద్యులు ప్రసన్నకుమారి, ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వై.రామవరం: ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం 84 మంది గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వ హించారు. స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రాహుల్ ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్‌లు, రక్తపరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. వారిలో 18 మంది హైరిస్క్ గర్భిణులను గుర్తించి ఆస్పత్రిలో చేర్పించారు. వారికి ప్రత్యేక వైద్యసేవలతో పాటు, అవసరమైన మందులు అందించారు. వైద్య శిబిరానికి వచ్చిన గర్భిణులకు ఉచిత భోజన వసతి, రవాణా సౌకర్యాలు కల్పించారు. గైనకాజలిస్టు డాక్టర్ మైమున్ తబుస్సుమ్, సీహెచ్‌సీ వైద్యాధికారులు సిబ్బంది పాల్గొన్నారు. మండలంలోని చవిటిదిబ్బలు పీహెచ్‌సీలో వైద్యాధికారులు డాక్టర్ నరేంద్ర, దినేష్‌ల ఆధ్వర్యంలో గర్భిణులకు స్కానింగ్, ప్రత్యేక వైద్యపరీక్షలు నిర్వహించారు.

రాజవొమ్మంగి: ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని లాగరాయి, జడ్డంగి, రాజవొమ్మంగి పీహెచ్‌సీల్లో శనివారం గర్భిణులకు ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు ఈ మెడికల్ క్యాంపులు ఎంతో దోహదపడతాయని జడ్డంగి పీహెచ్‌సీ డాక్టర్ నాగార్జున అన్నారు. గర్భిణులకు పలు ఆరోగ్య సూచనలిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరైన పౌష్టికాహారం సకాలంలో అందుతున్నది లేనిది ఆరా తీశారు. రక్తహీనత, ఐరన్ లోపం ఉన్న వారిని గుర్తించి అవసరమైన మందులు ఇచ్చారు. లాగరాయి పీహెచ్‌సీలో 18 మందికి, జడ్డంగి పీహెచ్‌సీలో 38 మందికి, రాజవొమ్మంగి పీహెచ్‌సీలో 35 మంది గర్భిణులను వైద్యులు పరీక్షించారు. డాక్టర్లు యామినిప్రియ, నాగార్జున, సుష్మ, ఏఎన్ఎంలు ఆశ, అంగన్‌వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

విద్యార్థిని హఠాన్మరణం

భీంపోలు ఆశ్రమ పాఠశాలలో కుప్పకూలిన బాలిక


మృతి చెందిన వైశాలి

అనంతగిరి (అరకులోయ రూరల్): భీంపోలు గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల విద్యార్థిని జన్ని వైశాలి (14) హఠాత్తుగా మరణించింది. ఎనిమిదో తరగతి చదువుతున్న ఆమె శనివారం స్నానం చేసి ఒక్కసారి కుప్పకూలి పోయిందని పాఠశాల వసతి గృహం నిర్వాహకులు తెలిపారు. సిబ్బంది హుటాహుటిన భీమవరం పీహెచ్‌సీకి తరలించారు. వైశాలి అపస్మారక స్థితికి వెళ్లడంతో ఎస్.కోట ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి స్వగ్రామం గుమ్మకోట పంచాయతీ గొట్టేలపాడు కావడంతో సంఘటన తెలుసుకుని తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రికి చేరుకున్నారు. తమ చిన్నారి పాఠశాలలో చక్కగా చదువుకుంటుందని అనుకున్నామని, ఇంతలోనే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయిందని బోరున విలపించారు. తమకు ప్రభుత్వమే న్యాయం చేయాలని కన్నీరుమున్నీరయ్యారు.

వరుస మరణాలతో భయందోళన: టోకూరు పాఠశాలలో ఇటీవల కాలంలో ఒక విద్యార్థి మృతి చెందిన విషయం మరువక ముందే ఈ ఘటన జరిగింది. విద్యార్థుల తలిదండ్రులకు ఈ దుర్ఘటన మరింత భయందోళన కలిగించింది.

కూటమి ప్రభుత్వం స్పందించాలి

పాఠశాల వసతి గృహాల్లో విద్యార్థుల మరణాలపై రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఎంపీపీ శెట్టి నీలవేణి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాల, వసతి గృహాల్లో పందులు పదుల సంఖ్యలో మృత్యువాత పడుతున్నా స్పందించడం లేదన్నారు. పాఠశాలలో హెల్త్ వలంటీర్‌ను నియమించాలన్నారు. అత్యవసర సేవలకు భీమవరం, పినకోట పీహెచ్‌సీల్లో అంబులెన్స్ సౌకర్యం కల్పించాలని సర్పంచ్ అప్పారావు, ఎంపీటీసీ సభ్యుడు యతవిటి నాయుడు ఐటీడీఏ పీవోని కోరినట్లు వారు తెలిపారు. ఈ సంఘటనపై ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి శవ పరీక్షల అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.